క్లుప్తంగా

బ్యానర్లు తొలగించాలి

నవాబుపేట: పోస్టర్లు, బ్యానర్లు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీలత సూచించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో సోమవారం మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశారు. రోడ్ల పక్కన, ఇండ్లకు ఉన్న పోస్టర్లు, గ్రామాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన జెండాలు, బ్యానర్లు అన్ని తొలగించాలని ఆమె సూచించారు.

కరపత్రం విడుదల



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం పాతపాలమూరులోని మజీదే రియాజుల్ జన్నాలో ఈనెల 14న 14వ మహిఫిలే నాతే షాహెకొనైన్ (భక్తిగీతాలాపన) నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ మహ్మద్ అబ్దుల్ ఖయ్యుం చిష్తీ ఖాద్రీ తెలిపారు. సోమవారం మసీదు ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్, వరంగల్, నారాయణపేట, జడ్చర్ల తదితర పట్టణాలనుంచి పలువురు పాల్గొని భక్తిగీతాలు ఆలపిస్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ వలీవుల్లా షరీఫ్, సయ్యద్ అహ్మద్ అలీ తాజ్, మహ్మద్ ఎహసాన్‌పాష ఖాద్రీ పాల్గొంటారని తెలిపారు. హాఫిజ్ జుబేర్‌బిన్ హసన్ బామజ్బార్, షేక్ బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

భూత్పూర్: అన్నాసాగర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం రూ.2లక్షల ఎల్‌ఓసీని అమిస్తాపూర్‌కు చెందిన బి.అనిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ చంద్రమౌళి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం



జడ్చర్ల టౌన్: వాసవీక్లబ్, వనితాక్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ యశోద ఆస్పత్రి సౌజన్యంతో పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్‌లో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 500మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు, మాత్రలు అందించారు. వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ మేడిశెట్టి రామకృష్ణ, ప్రవీణ్, సంధ్యారాణి, కండెకృష్ణ, లక్ష్మీనారాయణ, చిగుళ్లపల్లి పద్మలీల తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



కోయిల్‌కొండ: మండలంలోని ఆయా గ్రామాలలో రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ బూత్‌లను ఎంపీడీఓ జయరాములు సోమవారం పరిశీలించారు. సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ఫ్లెక్సీలు, పార్టీజెండాలు వంటి వాటిని తొలగించాలని సూచించారు. తహసీల్దార్ భరత్‌గౌడ్, ఎంపీఓ నజీర్‌హైమద్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌చోరీ కేసులో 15నెలల జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: ద్విచక్ర వాహనం దొంగతనం చేసిన కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ద్విచక్ర వాహనం చోరీ జరిగింది. ఘటనపై రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. చోరీకి పాల్పడిన గండీడ్ మండలం లింగంపల్లికి చెందిన ఏదుల బాబును సోమవారం ఎక్సైజ్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి వి.హరికుమార్ అతడికి 15నెలల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. పోలీసులు బాబును జిల్లా జైలుకు తరలించారు.

ఫంక్షన్‌హాల్ నిర్మిస్తాం

అడ్డాకుల: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ఫంక్షన్‌హాలు నిర్మాణం చేయిస్తామని జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.రాజశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం ఆలయాన్ని సందర్శించి ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఫంక్షన్‌హాలు నిర్మాణం చేయిస్తే బాగుంటుందని కోరడంతో అందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కనకయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు ఉన్నారు.

104ఉద్యోగుల నిరవధిక సమ్మె

పాలమూరు: జిల్లాలో పని చేస్తున్న 104ఉద్యోగులు నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు టీయూఎంహెచ్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయవర్ధన్‌రాజు తెలిపారు. ఏడు రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. టీటీడీ కల్యాణ మండపం ఎదుట ఏర్పాటుచేసిన దీక్ష కార్యక్రమంలో సోమవారం మాట్లాడారు. సుభాష్‌చంద్ర, వేణు, వెంకటేశ్వర్‌రెడ్డి, నిర్మల, సుజాత పాల్గొన్నారు.

కిక్కిరిసిన బ్యాంకులు

- జీరోఖాతా కోసం పోటెత్తిన దళితులు
- 'దళితబంధు' యూనిట్లకు ప్రత్యేక అకౌంట్లు

హన్వాడ: మండలంలో జీరో ఖాతాకోసం దళితులు పోటెత్తారు...'కోడ్' కూసే రోజు అని తెలియ డంతో దళితబంధు లబ్ధిదారులను అధికారులు అప్రమత్తం చేసి వెంటనే జీరో ఖాతాలు తెరవాలని సూచించడంతో ఒక్కసారిగా వారు బ్యాంకులకు పరుగెత్తారు. తమకు దళితబంధు మం జూరైందని.. అట్టి డబ్బులకు ప్రత్యేక ఖాతా కావాలని హన్వాడ ఎస్‌బీఐ మేనేజర్‌ను కోరడంతో ఒకే సారి పెద్దమొత్తంలో అకౌంట్లు తెరవడం కురదని ఆయన సూచించారు. దీంతో పలువురు దళిత ప్ర జాప్రతినిధులు, నాయకులు మేనేజర్‌తో సంప్రదింపులు జరిపారు. ఫలితం లేకపోవడంతో విషయం ఎంపీడీఓ ధనుంజయగౌడ్ వరకు చేరింది. ఈవిషయంపై ఎంపీడీఓ స్థానిక మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడినా వారి పొంతన కుదరకపోవడంతో ఎస్‌బీఐ పైఅధికారుల సూచనలతో మళ్లీ ఖాతాల స్వీకరణ ప్రారంభమైంది. చాలామంది ఎస్‌బీఐలోనే ఖాతాకు మొగ్గు చూపడంతో బ్యాంకులోని మేనేజర్ ఛాంబర్ కిక్కిరిసిపోయింది. మరికొందరు మండలకేంద్రం లోని మరోబ్యాంకు ఏపీజీవీబీలో ఖాతాలు తెరిచేందుకు వెళ్లడంతో ఇరుబ్యాంకులు ఖాతాదారులతో కిటకిటలాడాయి.



ఎస్‌బీఐ మేనేజర్ చాంబర్‌లో కిక్కిరిసిన దళితులు

మండలానికి 169 యూనిట్లు

మండలంలో మొత్తం 169యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ధనుంజయగౌడ్ పేర్కొన్నారు. హన్వాడకు 37, మిగతా గ్రామాలల్లోని దళితులకు 10 నుంచి 20యూనిట్ల చొప్పున మంజూరైనట్లు అధికారులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా దళిత బంధు కోసం గత ఆదివారం రాత్రి సైతం దరఖాస్తులు స్వీకరించారు. సోమవారమే 'కోడ్' వచ్చే వీలుందనే సమాచారంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈసమయంలో అధికారులకు, దళితులకు మధ్య కొంత ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినట్లు తెలిసింది.

సాధారణ ఖాతాలో వేస్తే బాగుండేది



దళితబంధు మంజూరైన లబ్ధిదారుల్లో కొందరికి ముందుగానే ఎస్‌బీఐలో ఖాతాలు ఉన్నాయి. కానీ అధికారులు దళితబంధు డబ్బులకు ప్రత్యేక బ్యాంకు అకౌంట్(జీరో ఖాతా) కావాలని నిబంధనలు పెట్టడంతో ఈసమస్య తలెత్తింది. బ్యాంకర్లు పేరుకు జీరో ఖాతా అంటూనే ఒక్కొక్క ఖాతా ఓపెనింగ్‌కు రూ.1000 వసూలు చేస్తూ అందులో జమ చేస్తున్నారు.

– వెంకటయ్య, పెద్దర్పల్లి.

కొనసాగిన శంకుస్థాపనలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ వార్డుల్లో తొమ్మిదో రోజు సోమవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ క్లబ్‌లో రూ.1.50 కోట్లతో నిర్మించే కన్వెన్షన్ హాల్, సూట్ గదులకు, షటిల్ కోర్టుకు భూమిపూజ చేశారు. అలాగే 39వ వార్డు పరిధిలో భగత్‌సింగ్ విగ్రహం, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ క్వార్టర్స్ సమీపంలో రూ.2.20 కోట్లతో చేపట్టే బీటీ రోడ్లకు, న్యూమోతీనగర్‌లో టెక్స్ అండ్ గ్రానైట్ సంఘం, బెస్త సంఘం, మాల దాసరి సంఘం కమ్యూనిటీ హాల్స్ కు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ ఇన్‌చార్జ్ చైర్మన్ కె.వెంకటయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్‌కుమార్, కమిషనర్ డి.ప్రదీప్ కుమార్, డిస్ట్రిక్ట్ క్లబ్ అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లు నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో బీటీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు



వేముల స్టేజీ వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీ

మళ్లీ లీకేజీ..!

అడ్డాకుల: వేముల స్టేజీ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న హనుమాన్ ఆలయం వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మళ్లీ లీకేజీ ఏర్పడింది. ఇక్కడ ప్రధాన మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతో పాటు స్థానికంగా ఉన్న కొన్ని నివాసగృహాలకు తాగు నీటి కనెక్షన్ ఏర్పాటు చేశారు. కాగా కనెక్షన్ ఉన్న చోట కొన్నాళ్ల నుంచి తరచు లీకేజీలు ఏర్పడుతున్నాయి. వాటిని పంచాయతీ సిబ్బంది సరి చేస్తున్నా మళ్లీ, మళ్లీ అదే చోట లీకేజీలు ఏర్పడటంతో నీళ్లు పెద్ద ఎత్తున వృథా అవుతున్నాయి. ఆలయ పరిసరాలు బురదగా మారడంతో పాటు వేముల బీటీరోడ్డు, జాతీయ రహదారిపై నీళ్లు పారడంతో రెండు రోడ్లు దెబ్బతింటున్నాయి. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజును వివరణ కోరగా కస్తూర్బాలో మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్‌కు గేట్‌వాల్ ఏర్పాటు చేసుకోవడంతో సమస్య ఏర్పడుతోందన్నారు. అక్కడ గేట్‌వాల్‌ను ఆఫ్ చేసినప్పుడు ప్రెషర్ ఎక్కువై ఇక్కడ లీకేజీలు ఏర్పడుతున్నాయని తెలిపారు. మంగళవారం లీకేజీలకు మరమ్మతు చేయిస్తానని పేర్కొన్నారు.

ఆగమేఘాల మీద ప్రారంభోత్సవాలు



వెన్నాచేడ్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండేడ్: గ్రామాల్లో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు సోమవారం ఆగమేఘాల మీద జరిగాయి. ఎన్నికల కోడ్ సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అమలులోకి రానుండడంతో అంతకుముందే పలు కార్యక్రమాలు నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఉదయం 9గంటల నుంచే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రుసుంపల్లి సీసీరోడ్డు, చిన్నవార్వాల్‌లో సీసీ, గ్రామపంచాయతీ నిర్మాణానికి భూమిపూజ, బతుకమ్మ చీరల పంపిణీ, పెద్ద వార్వాల్‌లో మత్స్య సంఘం భవనం, వెన్నాచేడ్‌లో ఎస్సీ కమ్యూనిటీ భవనం భూమిపూజ, పగిడ్యాల్ నుంచి తువ్వగడ్డ తండావరకు బీటీరోడ్డు, పగిడ్యాల్ నుంచి పరుగుల తండా వరకు బీటీరోడ్డు శంకుస్థాపన చేశారు. వీటితో పాటు మరిన్ని కార్యక్రమాల్లో ఆయన పాల్గలొన్నారు. ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, కోఆప్షన్ సభ్యుడు సలీం, పిఏసిఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఆర్‌ఎస్‌ఎస్ చైర్మన్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి జూలపల్లిలో పంచాయతీ భవనం ప్రారంభం, స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేశారు. బతుకమ్మ చీరలను అందించారు. అన్నారెడ్డిపల్లిలో సర్పంచ్ భామిని, సూర్యానాయక్‌లు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని కప్పెట, హస్నాపూర్ గ్రామాలల్లో ప్రజాప్రతినిధులు ఎన్నికల కోడ్ నేపథ్యంలో హడావుడిగా సోమవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కప్పెటలో పంచాయతీ భవనం, హస్నాపూర్ నుంచి భగీరథ కాలనీకి వెళ్లే బీటీరోడ్డుకు నిర్మాణానికి ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ శంకుస్థాపన చేశారు. భూత్పూర్‌లో వైకుంఠధామంతో పాటు మరిన్ని ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. వైస్‌ఎంపీపీ నరేష్ గౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.



అల్లీపురంలో..

చిన్నచింతకుంట: మండలంలోని వివిధ గ్రామాలల్లో సోమవారం ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి బీటీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లు అందజేశారు.

రాజాపూర్: రంగారెడ్డిగూడలోలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని సోమవారం ఉదయం సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డి ప్రారంభించారు. ఉపసర్పంచ్ రాములుగౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. కాగా ఎంపీపీ సుశీల, జెడ్పీటీసీ మోహన్ నాయక్‌లు తమకు సమాచారం ఇవ్వకుండా పంచాయతీ భవనం ప్రారంభించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు.

దివ్యాంగులకు ద్విచక్రవాహనాలు



నవాబుపేట: దివ్యాంగులకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ద్విచక్రవాహనాలు అందజేశారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సీఎస్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా మెగా ఇంజనీరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్, బాలకిష్టయ్య, పద్మారెడ్డి, నరేష్, సత్యం, గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డు అమలుపై హర్షం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగ, ఉపాధ్యాయులు చాలాకాలం నుంచి ఎదురు చూస్తున్న హెల్త్ కార్డు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేయడంపై పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి రఘురాంరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల కంట్రిబ్యూషన్ తీసుకుని ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేసి అందులోఉద్యోగ, ఉపాధ్యాయ వర్గం నుంచి 6 గురిని సభ్యులుగా ట్రస్ట్‌లో తీసుకోవడం వల్ల ఈహెచ్‌ఎస్ పకడ్బందీగా అమలు అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

ఎస్పీకి ఫిర్యాదు చేసిన నాయకులు

అడ్డాకుల: నందిపేట గ్రామంలో ఆదివారం జరిగిన ఎమ్మెల్యే కార్యక్రమం సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలో ఎస్‌ఐ కె.శ్రీనివాసులు తమను అసభ్య పదజాలంతో దూషించారని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ సోమవారం జిల్లా కేంద్రంలో ఎస్పీ కె.నరసింహను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఒక ప్రకటనలో వివరాలు పేర్కొన్నారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించేందుకు ప్రయత్నిస్తే బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేస్తుండగా ఎస్‌ఐ తమపై దురుసుగా ప్రవర్తించినందున చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొనట్లు వివరించారు.

యువత క్రీడల్లో రాణించాలి



చిన్నచింతకుంట: గూడూర్‌లో ప్రభుత్వం సరఫరా చేసిన స్పోర్ట్స్‌కిట్‌ను సోమవారం సర్పంచ్ కాంతరావు గ్రామ యువకులకు అందజేశారు. క్రీడల్లో రాణించి గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు. కురుమూర్తి ఆలయ కమిటీ మెంబర్ నాగరాజు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాసులు ఉన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

జడ్చర్ల టౌన్: జనంపల్లి అనిరుధ్‌రెడ్డి క్రికెట్ లీగ్ పేరుతో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి టోర్నీ సోమవారం ప్రారంభం అయ్యింది. గంగాపురం సమీపంలోని మైదానంలో నిర్వహిస్తున్న టోర్నీలో మొత్తం 100జట్లు పాల్గొంటున్నాయి. స్థానిక కాంగ్రెస్‌నాయకులు నిత్యానందం, బుక్క వెంకటేశం, గంగ్యానాయక్‌లు ప్రారంభించారు. మొదటిరోజు మూడు మ్యాచ్‌లు నిర్వహించారు. 15రోజుల పాటు నిర్వహించే పోటీల్లో విజేతకు రూ.1లక్ష నగదు బహుమతి అందించనున్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి కోరారు. సోమవారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వలె పీఆర్‌సీ, డీఏ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి బి.చంద్రకాంత్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు కె.బాలరాజు, ఉపాధ్యక్షుడు పి.విశ్వనాథం, సంఘం నాయకులు చంద్రశేఖర్, కేశవులు, రవీందర్, శంకర్, నరసమ్మ, లక్ష్మమ్మ, రాధమ్మ పాల్గొన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ ఏఎంసీ వెంకటేశ్వరరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు.



మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు

గ్రామక్షేమానికి కాగడ యాత్ర

గండేడ్: కర్ణాటకలోని సోలాపూర్ మండలం అందెవాడి బీకేకి చెందిన రామలింగేశ్వర మఠం సభ్యులు తమ గ్రామక్షేమాన్ని కోరుతూ శ్రీశైలం పాదయాత్రగా వెళ్లి తిరుగుప్రయాణంలో కాగడాతో వెళ్తున్నారు. సోమవారం గండేడ్ మండలం మీదుగా వెళ్తున్న వారు మండలకేంద్రంలోని పలువురు వారికి తారసపడి కాగడాతో వెళ్తుండడానికి గల కారణం తెలిపారు. గ్రామం క్షేమం కోసం ఏటా ఓ తీర్థయాత్రను ఎంచుకున్నట్లు తెలిపారు. దైవదర్శనానంతరం తిరుగుప్రయాణంలో కాగడాలతో వెళ్తామన్నారు. ఇలా చేయడం వల్ల తమ గ్రామానికి మంచి జరిగి పాడిపంటలు సమృద్ధిగా పండుతున్నాయని, గ్రామంలో ప్రతిఒక్కరూ క్షేమంగా జీవిస్తారని నమ్మకాన్ని వెలిబుచ్చారు.



కాగడాతో రామలింగేశ్వర మఠం సభ్యులు

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో మాజీ సర్పంచ్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబ్‌నగర్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో జైనల్లీపూర్‌కి చెందిన జీకే షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు సీనియర్ మాస్టర్ బి.శ్రీధర్‌గౌడ్ తెలిపారు. విద్యార్థులను సోమవారం మాజీ సర్పంచ్ నర్సిములు, జీకే మాస్టర్ షోటోకాన్ చీఫ్ జి.కృష్ణయ్య తదితరులు అభినందించారు. కరాటే పోటీల్లో అప్పన్నపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు మాస్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను సోమవారం హెచ్‌ఎం ఫౌజియా భానును అభినందించారు. అదేవిధంగా మహబూబ్‌నగర్‌లో జరిగిన ఓపెన్ కరాటే పోటీల్లో ఆర్‌కే స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు మూడు గ్రాండ్ చాంపియన్‌షిప్‌లు సాధించినట్లు మాస్టర్ కె.రవికుమార్ తెలిపారు.

కింగ్‌షోటోకాన్‌కు పతకాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలో జరిగిన ఆల్‌స్టైల్ కరాటే పోటీల్లో కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా విద్యార్థులు పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఈ మేరకు వారిని సోమవారం అభినందించారు.

హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగ పర్చిన హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలని సోమవారం డీఈఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. స్పౌజ్ పాయింట్‌లు పొందిన వారు నిబంధనల ప్రకారం భార్యభర్తలు ఒకే చోటుకు బదిలీ కావాల్సి ఉంది. కానీ వాటిని పట్టించుకోకుండా అడ్డగోలుగా హెచ్‌ఆర్‌ఏ పాయింట్‌లకు బదిలీ అయ్యారని పేర్కొన్నారు. భవిష్యత్తులో జరిగే బదిలీల్లో ఇటువంటి తప్పులు జరగకుండా, ప్రస్తుతం జరిగిన తప్పిదాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిష్టయ్య, ఉమాదేవి, క్రిష్టయనాయక్, శివరాజ్, కనకమ్మ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు?

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: ఏళ్లుగా పాలన సాగించిన పార్టీలు దేశానికి, రాష్ట్రానికి చేసిందేమీ లేదని... వారికంటే ఎక్కువగా కేవలం తొమ్మిదిన్నరేళ్లలో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పెద్దాయపల్లిలో రజకసంఘం, నాయీ బ్రాహ్మణుల సంఘాలకు భవనాలకు భూమిపూజ చేశారు. గౌతాపూర్‌లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, అక్కడ నిర్మించిన 64 రెండు పడకల ఇళ్లను బాలానగర్, సమ్యతండా, గౌతాపూర్ గ్రామాల వాసులకు పంపిణీ చేశారు. పెద్దాయపల్లి శివారులో నిర్మించిన ఇళ్లను బాలానగర్, పెద్దాయపల్లి ప్రజలకు పంపిణీ చేశారు. పెద్దరేవల్లిలో అర్హులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలను, దళితబంధు అర్హులను ప్రకటించగా.. తమకెందుకు రాదని కొందరు గొడవకు దిగారు. అనంతరం పెద్దబాయి తండాలో ఆలయానికి వెళ్లిన ఎమ్మెల్యేను తండావాసులు కాసేపు అడ్డుకున్నారు. కాగా అక్కడవారు సర్దిచెప్పి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీజేపీలు ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తెలపాలన్నారు. అలాంటి వారు ఒకరి కాళ్లు ఒకరు పట్టుకుని కిందకు లాగడానికే 5 సంవత్సరాల కాలం అయిపోతుందని ఎద్దేవా చేశారు. వారిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ కమల, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రావు, వెంకటచారీ తదితరులు ఉన్నారు.

కులరహిత సమాజానికి కృషి చేయాలి.

రాజాపూర్: కులాలు అనేవి మనం సృష్టించుకున్నవని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. కులరహిత సమాజస్థాపనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. సోమవారం మండల కేంద్రంలో దళిత ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. దళితుల మనే భావన పక్కన పెట్టి అందరితో సమానంగా సమాజంలో ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన విధానంతోనే ఆర్థికంగా ఎదిగేందుకు దళితబంధు పథకం తీసుకువచ్చారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ సుశీల, మండలసర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కొప్పొరిబచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




గౌతాపూర్‌లో పట్టాల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఐదేళ్లు మీ కోసం పనిచేస్తా

రాజాపూర్: ఎన్నికల కోడ్ వచ్చేసింది నాకోసం యాభైరోజులు మీరు పనిచేయండి.. మీకోసం నేను ఐదేళ్లు పనిచేస్తా అంటూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గ్రామాల్లో నాయకులనుద్దేశించి మాట్లాడారు. సోమవారం సింగమ్మతండా, తిర్మలాపూర్ గ్రామాల్లో పంచాయతీ భవనాలను, రాఘవాపూర్, ఖానాపూర్, కుత్నపల్లి గ్రామాల్లో సీసీరోడ్లు, తదితరాలను ప్రజాప్రతినిధులతో ప్రారంభించారు.

హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

అడ్డాకుల: హమాలీలకు సమగ్ర చట్టం చేయాలని, వారి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు వి.కురుమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని కందూర్‌లో సోమవారం హమాలీలతో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. 50 సంవత్సరాల వయసు దాటిన వారికి ప్రభుత్వం నెలకు రూ.5వేల పెన్షన్ అందజేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్‌ఐ, గ్రాట్యూటీ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీలు బరువులను ఎత్తడం వల్ల అనారోగ్య సమస్యలకు గురవుతున్నందున వారికి వైద్య సౌకర్యం, ప్రమాద బీమా వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో బాలయ్య, చంద్రమౌళి, పాపన్న, తిరుపతయ్య, ఆశన్న, మహేష్, మన్నెంకొండ, శ్రీను, బాలన్న తదితరులు పాల్గొన్నారు.



కందూర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి పాత పోలీస్‌స్టేషన్ వరకు సీసీరోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనులను సర్పంచ్ కృష్ణయ్య సోమవారం ప్రారంభించారు. అదేవిధంగా మైసమ్మగేట్ దగ్గర బస్‌షెల్టర్‌కు నిర్మాణ పనులకు, ఈద్గా దగ్గర సీసీ రోడ్డు నిర్మాణ పనులను సైతం ప్రారంభించా రు. ఎంపీటీసీ ఆంజనేయులు, నాయకులు జగన్, రాజ్‌కుమార్, కుమ్మరిరాజు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కృష్ణయ్య